
జగ్జీవన్‌రామ్ ఆశయ సాధనకు కృషి చేయాలి
- అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ 6

రైతాంగంపై రాష్ట్ర ప్రభుత్వానికి చిన్నచూపు



బాధలు వింటూ.. భరోసా ఇస్తూ..

- రాజన్న సిరిసిల్ల జిల్లాలో కేసీఆర్ పొలం బాట
- బోయినపల్లి రైతులతో ముచ్చటించిన మాజీ సీఎం
- ఎండిన పంటలను చూపించిన బాధితులు
- ప్రభుత్వంపై పోరాడుదాం
- బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

ఎండిన పంటలను పరిశీలిస్తూ, రైతులకు భరోసానిస్తూ, రైతుల బాధలు వింటూ బీఆర్ఎస్ అధినేత మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పొలంబాట పట్టారు. శుక్రవారం రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండల కేంద్రం శివారులోని ఎండిన పంట పొలాలను పరిశీలించారు. ప్రత్యేక బస్‌లో వచ్చిన కేసీఆర్ రైతులతో మమేకమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎంత సాగు చేశారు. ఎంత ఎండి పోయింది. ఎంత నష్టం వచ్చిందని వారి బాధలను తెలుసుకున్నారు. ఎండిన పంటల పరిస్థితులు చూసి రైతులు కేసీఆర్ ముందు ఆవేదన వ్యక్తం చేశారు. మహిళా రైతులు కౌలుకు తీసుకొని సాగు చేసుకున్న పంట చేతికి రాకుండా పోయిందని, అప్పుల పాలయ్యామని ఆవేదన వ్యక్తం చేశారు. వరద కాలువలో నీళ్లు ముందే వదిలేతే పంట కొంత చేతికి వచ్చేదని రైతులు తెలిపారు. శాభాష్‌పల్లి బ్రిడ్జిపై నుంచి మిడ్ మానేరు ప్రాజెక్ట్‌ను పరిశీలించారు. మిడ్ మానేరు సముద్రంలా తలపించేలా ఉండేదని మునిగిపోయిన ఊళ్లు తేలాయని కేసీఆర్ గుర్తు చేశారు. అక్కడి నుంచి సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని తెలంగాణ భవన్‌కు వచ్చారు.

సిరిసిల్ల నేతకార్మికుల సమస్యలపై చర్చ

సిరిసిల్లలోని తెలంగాణ భవన్‌లో సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ సంక్షోభంపై పరిశ్రమ ప్రతినిధులు, కార్మిక సంఘాల నాయకులతో మాజీ సీఎం కేసీఆర్ చర్చించారు. ఆర్డర్లు లేక పడుతున్న ఇబ్బందులను గత ప్రభుత్వ హయాం నుంచి రావాల్సిన రూ.300 కోట్ల బకాయిలు ప్రస్తుత ప్రభుత్వం విడుదల చేయలేదని కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లారు. కార్మికుల సమస్యలను పరిష్కరించడానికి అండగా ఉంటానని హామీ ఇచ్చారు. హైకోర్టులో సైతం కేసు వేస్తానని తెలిపారు. మాజీ మంత్రి కేటీఆర్ బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళాచక్రపాణి, వైస్ చైర్మన్ మంచె శ్రీనివాస్, టెక్స్‌టైల్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, వస్త్ర పారిశ్రామిక ప్రతినిధులు జిందం చక్రపాణి, గోవిందు రవి, శంకర్, దేవదాస్, కార్మిక సంఘం నాయకులు పంతం రవి, మూషం రమేష్ ఉన్నారు.



సిరిసిల్లలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ అధినేత కేసీఆర్

చేతికర్ర సాయంతోనే..

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ చేతి కర్ర సాయంతోనే నడిచారు. బస్సు దిగే క్రమంలో సహాయకులు, ఎమ్మెల్యేలు సహాయపడ్డారు. పొలాల వద్ద ఇబ్బందులు కలగకుండా రోప్ వేతో రక్షణ కల్పించారు.

'సీఎం.. సీఎం' అంటూ నినాదాలు

కేసీఆర్ పర్యటనతోపాటు తెలంగాణ భవన్ వద్ద 'సీఎం.. సీఎం' అంటూ కార్యకర్తలు, నాయకులు నినాదాలు చేశారు. అందరికీ అభివాదం చేస్తూ పలువురిని పలకరించారు. తెలంగాణ భవన్ వద్ద ఆయనకు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారు ఘనంగా స్వాగతం పలికారు.

చేనేత కార్మికులే పులులై గర్జిస్తారు.. తరిమికొడతారు..

'చేనేత కార్మికుల మనోభావాలు దెబ్బతీస్తారా? నిరోధ్‌లు, పాపుడాలు అమ్ముకొమ్మంటారా, మనుషుల్లా కనిపించడం లేదా, చేనేత కార్మికులే పులులై గర్జిస్తారు. తరిమి కొడతారు' అని బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు హెచ్చరించారు. బతుకమ్మ చీరలు, యూనిఫాం బకాయిలు విడుదల చేయాలని లేదంటే లీగల్‌గా ఎదుర్కోవాల్సి వస్తుందని కేసీఆర్ అన్నారు. శుక్రవారం జిల్లాలో బోయినపల్లి మండల కేంద్రం శివారులో ఎండిపోయిన పంటలను పరిశీలించారు. రైతుల నుంచి ఎండిన పంటల వివరాలను తెలుసుకున్నారు. శాభాష్‌పల్లి బ్రిడ్జి నుంచి నీటి మట్టం తగ్గిన మిడ్‌మానేరు ప్రాజెక్ట్‌ను పరిశీలించారు. అనంతరం సిరిసిల్లలోని బీఆర్ఎస్ తెలంగాణ భవన్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా కేసీఆర్ మాట్లాడుతూ సిరిసిల్లలో చేనేత కార్మికులు 'ఆత్మహత్యలు వద్దు.. చావు సమస్యకు పరిష్కారం కాదు' అని ఒకనాడు గోడలపై రాతలు చూశానని, జయశంకర్‌తోపాటు తనకు కన్నీళ్లు వచ్చాయని అన్నారు. 65 ఏళ్ల స్వాతంత్ర్య భారతంలో చావకండని గోడల మీద రాసే ప్రభుత్వాలు చూస్తున్నామని బాధపడ్డామన్నారు. ఏట్లైనా చేసి చేనేత కార్మికులను ఆదుకోవాలని ప్లాన్ చేశామన్నారు. సిరిసిల్లలో ఒకే రోజు 11 మంది చనిపోతే పార్టీ నుంచి రూ.50 లక్షలు తెచ్చి ట్రస్ట్ ఏర్పాటు చేసి ఇచ్చామన్నారు. తెలంగాణ వస్తుందని చెప్పామన్నారు. బోధన్ పోచంపల్లిలో ఏడుగురు చనిపోతే చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో రూ.50 వేల ఎక్స్‌గ్రేషియా ఇవ్వమని దండం పెట్టినా ఇవ్వకుంటే భిక్షాటన చేసి ఆ కుటుంబాలకు ఇచ్చామన్నారు.

సిరిసిల్లలో రంజాన్, క్రిస్మస్, స్కూల్ యూనిఫాం, బతుకమ్మ చీరలు వంటి ఆర్డర్లతో చేనేత కార్మికులకు ఉపాధి కల్పిస్తే ఇప్పుడు మళ్లీ పాత రోజులే వచ్చాయని కార్మికులు చెబుతున్నారన్నారు. గత ప్రభుత్వంలోని రూ.300 కోట్ల బకాయిలు కూడా ఇస్తలేరని చెప్పారన్నారు. హైకోర్టుకు వెళ్లైనా బకాయిలు ఇప్పిస్తామని చెప్పామన్నారు. సిరిసిల్లలో మళ్లీ ఆత్మహత్యలు మొదలయ్యేటట్లు ఉన్నాయని అంటే ఓ కాంగ్రెసోడు ఏంపోయింది. నిరోధ్‌లు, పాపుడాలు అమ్ముకొని బతకమన్నాడని అన్నారు. నిరోధ్‌లు అమ్ముకొని బతకాల కుక్కల కొడుకుల్లారా? మీరు మనుషులేనా, చేనేత కార్మికుల మనోభావాలు దెబ్బతీస్తారా? అని హెచ్చరించారు. చేనేత కార్మికులే పులులై గర్జిస్తారు. తరిమికొడుతారని అన్నారు. బతుకమ్మ చీరల బకాయిలు విడుదల చేయాలని ప్రభుత్వ ఆర్డర్లు ఇవ్వాలని అన్నారు. చేనేత కార్మికుల సమస్యలపై రాష్ట్రమంతా రణరంగం చేసి ఫుట్ బాల్ ఆడతామని, విడిచి పెట్టబోమని హెచ్చరించారు. చేనేత కార్మికులను మొన్నటిదాకా దొబ్బితిన్నారని, దోచుకుతిన్నారని అంటారా? దొంగ నా కొడుకుల్లారా అని ఘాటుగా విమర్శించారు. చేనేత కార్మికులను నీచంగా మాట్లాడిన కాంగ్రెస్ నేతలు క్షమాపణ చెప్పాలన్నారు. సిరిసిల్లలో పదివేల మంది కార్మికులు ధర్నా చేస్తున్నారని, తమ పార్టీ నాయకులు కూడా పాల్గొంటారని తెలిపారు.



బోయినపల్లి మండల కేంద్రంలో పంటలను పరిశీలించి రైతులతో మాట్లాడుతున్న కేసీఆర్

అసమర్థ, అవివేక విధానాలు

ప్రస్తుత ప్రభుత్వం తెలివితక్కువ, అసమర్థ, అవివేక, అర్భాక, చవట విధానాల దరిద్రం వల్లనే నాశనానికి వచ్చిందని, మళ్లీ 2014కు ముందు తెలంగాణలో ఏగోస, ఏబాధ, ఏడ్పు పడ్డామో... కాలిపోయిన మోటార్లు, నీళ్ల ట్యాంకర్లు, ఎండిపోయిన పంటలు, పేలిపోయే ట్రాన్స్‌ఫార్మర్లు, నీళ్ల కోసం ఎదురు చూపుల సీన్లు మళ్లీ పునరావృతం అయ్యాయని కేసీఆర్ అన్నారు. తెలంగాణలో పంటలు ఎండని జిల్లా లేదు. నీళ్ల కరువు లేని ప్రాంతం లేదని, పాత తెలంగాణ మళ్లీ పునరావృతమైందని, ఇందిరమ్మ రాజ్యంలో ఇగిలించిన పరిస్థితి ప్రజలది అయ్యిందని కేసీఆర్ అన్నారు. నీటి నిల్వ సామర్థ్యం తెల్వని లత్‌కోర్‌లు, చవట దద్దమ్మలు రాజ్యమేలుతున్నారు కాబట్టి ఈ పరిస్థితి వచ్చిందన్నారు. కాలం తెచ్చిన కరువా... మనుషులు తెచ్చిన కరువా, కాంగ్రెస్ తెచ్చిన కరువా అని అన్నారు.



వస్త్ర సంక్షోభంపై నేత కార్మికులతో సమావేశం

మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్, ఏపీ సీఎం జగన్, గవర్నర్ నరసింహన్‌తో కలిసి కాళేశ్వరం ప్రాజెక్ట్ ప్రారంభించిన సందర్భంలో కాళేశ్వరం ద్వారా కరీంనగర్ జిల్లాలో నాలుగు సజీవ ధారలు సృష్టించామని కరీంనగర్ ప్రజలు కూడా ఫలితాలను అనుభవించారని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ ద్వారా కరీంనగర్ శాశ్వతంగా జలకళతో ఉంటుందని అనాడే చెప్పామన్నారు. అప్పర్ మానేరు నుంచి అన్నవరం బ్యారేజీ వద్ద గోదావరిలో కలిసే మానేరు వాగు నిరంతర జలధారగా చూశారని, దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్నాశ్రీరాంసాగర్ పునర్జీవం పేరుతో వరద కాలవలో నీళ్లు నిండుగా ఉండేలా చేశామన్నారు. నిండు గర్భిణిలా ప్రవహించే కాకతీయ కాలువ, గోదావరి నదిలా నిర్మించిన బ్యారేజీలు ఎల్లంపల్లి, ఎస్ఆర్ఎస్‌పీలను కాళేశ్వరం గోదావరి జలాలతో జలధారలుగా మార్చామని అన్నారు. రాళ్లవానతో వచ్చిన నష్టం లక్ష ఎకరాలైతే సాగునీరందక 15 నుంచి 20 లక్షల ఎకరాల మధ్య పంటలు ఎండిపోయాయని పర్యటించిన గ్రామాల్లో రైతులు లెక్కలు చెబుతున్నారన్నారు. వర్షపాతం తక్కువ ఉందని కొందరు మంత్రులు అంటున్నారని, అది పూర్తిశుద్ధ తప్పు అని అన్నారు.

25 జిల్లాల్లో సాధారణ వర్షపాతం కంటే ఎక్కువ వర్షపాతం కురిసిందన్నారు. ఎక్కువ వర్షపాతం ఉన్న చోట కూడా ఈ పరిస్థితులు ఎందుకు వచ్చాయని ప్రశ్నించారు. పూర్తిగా ప్రభుత్వ అసమర్థత, వైఫల్యం తప్ప వేరే కారణం లేదన్నారు. కాలం కాకుంటే రైతులు ఇంత నష్టపోరని, పంటలు వేసుకోరని అన్నారు. పంట వేసి, ఎకరానికి పెట్టుబడులు పెట్టి గోసపడుతున్నారని అన్నారు. రైతు బంధు విషయంతో తొండిపెట్టి ఇస్తారా లేదా అనే కన్ఫ్యూజన్‌లో పెట్టారని అన్నారు. ఇంకా రైతు బంధు వంద శాతం వెయ్యలేదని అన్నారు. దాని మీద ఓ పాలసీ లేదు, ధైర్యలేదన్నారు. చెప్పే తెలివి తేటలు లేని వైఫల్యమని అన్నారు. రాష్ట్రంలో రైతులు 200 మంది చనిపోయారని అంటే 48 గంటల్లో చనిపోయిన రైతుల లిస్ట్ ముఖ్యమంత్రి ఇవ్వమంటే నాలుగు గంటల్లోనే ఇచ్చామన్నారు. దాని తరువాత కూడా ఆత్మహత్యలు జరిగాయన్నారు. ఇప్పటికి ఉరుకులేదు, పరుగులేదని అన్నారు. మీ అసమర్థత వల్ల చనిపోయారు కాబట్టి రూ 25 లక్షల నష్ట పరిహారం ఇవ్వాలని, కుటుంబాలను పరామర్శించాలని డిమాండ్ చేశారు. లేదంటే ఉసురు, పాపం తగులుతుందని అన్నారు. ఏమాత్రం వదిలిపెట్టమని అన్నారు. పంట నష్టపోయిన వారిని ఎకరానికి రూ 25 వేలు ఇవ్వాలని అన్నారు. పంటనష్టపోయింది, రైతాంగం కన్నీరు మున్నీరు అవుతున్నది వాస్తవమన్నారు. నాలుగు మాసాల వరకు ఏమి అనలేదని, కొత్త ప్రభుత్వానికి టైం ఇవ్వాలని ఊరుకున్నానని అన్నారు. ఫసల్ బీమా యోజన అట్టర్ ఫ్లాప్ స్కీమ్ అన్నారు. బీజేపీ ఎక్కడ ఉన్నదని అభ్యర్థుల కోసం తమ పార్టీ చుట్టూ తిరుగుతున్నారని అన్నారు. బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ అధ్యక్షుడు కేటీఆర్, మాజీ ఎంపీ వినోద్‌కుమార్, ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్ రెడ్డి, గంగుల కమలాకర్, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యేలు చెన్నమనేని రమేష్‌బాబు, వొడితెల సతీష్‌రావు, బాల్క సుమన్, రసమయి బాలకిషన్, సుంకె రవిశంకర్, నాస్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్ రావు, మాజీ ఎమ్మెల్సీలు నారదాసులక్ష్మణ్‌రావు, భానుప్రసాద్, జడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, టెక్స్‌టైల్ కార్పొరేషన్ చైర్మన్ గూడూరి ప్రవీణ్, కరీంనగర్ కార్పొరేషన్ చైర్మన్ రవీందర్ సింగ్, సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, మున్సిపల్ చైర్‌పర్సన్లు జిందం కళ, రామతీర్థపు మాధవి, మున్సిపల్ వైస్ చైర్మన్ మంచె శ్రీనివాస్, మాజీ జడ్పీ చైర్‌పర్సన్ తుల ఉమ, బీఆర్ఎస్ నాయకులు చల్మెడ లక్ష్మీనర్సింహారావు, జిందం చక్రపాణి, గజభీంకార్ రాజన్న, వసంత, దరువు ఎల్లం, శ్రీనివాసరెడ్డి, బొల్లి రామ్మోహన్ తదితరులు ఉన్నారు.

బాబు జగ్జీవన్‌రామ్‌కు ఘన నివాళి

బాబు జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ సిరిసిల్లలో నివాళులర్పించారు. ముందుగా జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూల మాలలు వేశారు.

కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న డీఆర్‌డీవో శేషాద్రి

కోనరావుపేట, ఏప్రిల్ 5 : ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని డీఆర్‌డీవో శేషాద్రి అన్నారు. కోనరావుపేట మండలం అజ్మీరా తండాలో గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో విక్రయించాలని, ప్రభుత్వ మద్దతు ధర పొందాలని అన్నారు. డీపీఎం పాపారావు, చెక్కపల్లి స్వాతి, శిరీష, సులోచన, వసంత, సీసీలు శోభ, రేణుక, శ్రీదేవి, బాలరాజు, రవి,జనార్దన్, రాజేశ్వరి, భాగ్యలక్ష్మి, సంధ్య, కవిత ఉన్నారు.

ఇల్లంతకుంట: మండలంలోని తెనుగువానిపల్లె, రంగపేట గ్రామాలలో డీసీఎంఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఇన్‌చార్జి కడగండ్ల తిరుపతి మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు కొనుగోలు కేంద్రాలు కొనసాగుతున్నాయని, నిబంధనలు పాటించి ధాన్యాన్ని కేంద్రాలకు తీసుకవచ్చి మద్దతు ధరను పొందాలని అన్నారు. కార్యక్రమంలో సెంటర్ నిర్వాహకులు అనీల్, రాకేష్, కిషన్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పోచమ్మ బోనాలు



బోనాలతో వెళ్తున్న మహిళలు

తంగళ్లపల్లి, ఏప్రిల్ 5: తంగళ్లపల్లి మండలం దేశాయిపల్లెలో శుక్రవారం పోచమ్మ బోనాలను ఘనంగా నిర్వహించారు. ప్రతి ఇంటి నుంచి మహిళలు నెత్తిన బోనం పెట్టుకొని తరలిరాగా ఖైండ్ల రాజుల నృత్యాలు, శివ సత్తుల శిగాలు, ఆటపాటలతో బోనాల ఊరేగింపు భక్తిశ్రద్ధల మధ్య సాగింది. అనంతరం పోచమ్మకు బోనాలను సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు



పూజలు చేస్తున్న కేకే మహేందర్‌రెడ్డి

సిరిసిల్ల రూరల్, ఏప్రిల్ 5 : సిరిసిల్ల అర్బన్ పరిధిలోని సర్దాపూర్ శివారులోని జగ్గారావుపల్లె ముదిరాజ్ సంఘం అధ్వర్యంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో పెద్దమ్మ పెద్దిరాజుల విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు మూడు రోజులుగా వైభవంగా కొనసాగుతున్నాయి. శుక్రవారం ఉదయం విగ్రహాలకు జ్యోషి విద్యాసాగర్ శర్మ ఆధ్వర్యంలో పూజారులు ప్రత్యేక పూజలు చేసి ఆలయంలో ప్రతిష్ఠించారు. అనంతరం ముదిరాజు కులస్థులు పెద్దమ్మ, పోచమ్మ బోనాలు తీశారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆదిశ్రీనివాస్, సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు గంభీరావుపేట ప్రశాంత్ గౌడ్, వైద్యశివప్రసాద్, బాలరాజు, దేవయ్య, పర్శ హన్మాండ్లు, ముదిరాజ్ సంఘం నాయకులు పాల్గొన్నారు.

అడవుల సంరక్షణ అందరి బాధ్యత



పరిశీలిస్తున్న డీఎఫ్‌వో బాలామణి

వీర్నపల్లి, ఏప్రిల్ 5 : అడవుల సంరక్షణ అందరి బాధ్యతని, అడవులను నరికి వేస్తే జీవరాశి మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుందని జిల్లా అటవీశాఖ అధికారి బాలామణి అన్నారు. వీర్నపల్లి మండల కేంద్రంలోని సెంట్రల్ హరితహారం నర్సరీ, అటవీ బౌండరీ పిల్లర్లను శుక్రవారం పరిశీలించారు. నర్సరీల పెంపకంపై సిబ్బందికి సూచనలు చేశారు. అటవీ విస్తీర్ణంపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. అటవీ శాఖ రేంజ్ అధికారి శ్రీనివాస్‌రావు, వీర్నపల్లి, అల్మాస్‌పూర్ సెక్షన్ అధికారులు రంజిత్ కుమార్, పద్మలత ఉన్నారు.

సంస్కృతీసంప్రదాయాలను కాపాడుకోవాలి

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ, ఏప్రిల్ 5 : సంస్కృతీసంప్రదాయాలు కాపాడే దిశలో విద్యనందించే బాధ్యత నిర్వర్తించడం గొప్ప విషయమని వేములవాడ శాసనసభ్యుడు, రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడ పట్టణంలోని శ్రీసరస్వతీ శిశు మందిర్ 44వ వార్షికోత్సవ వేడుకలు శుక్రవారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ సంస్కృతీసంప్రదాయాలు పెంపొందించే విధంగా విద్యను అందించడం అభినందనీయమన్నారు. ప్రధాన వక్త, ప్రాంత ప్రముఖ, వేములవాడ పాఠశాల పూర్వ ప్రధానాచార్యులు న్యాలమడుగు శంకరయ్య మాట్లాడుతూ శిశుమందిరాలు క్రమశిక్షణ నేర్పడంలో ప్రముఖపాత్ర పోషిస్తాయన్నారు. చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అనంతరం వార్షిక పరీక్షల ఫలితాలలో ప్రథమ, ద్వితీయ స్థానాలలో గెలిచిన విద్యార్థులకు, గతేడాది 10వ తరగతిలో జీపీఏ సాధించిన విద్యార్థులకు బహుమతులు అందించారు. పాఠశాల సమితి సభ్యులు గర్శకుర్తి వెంకటేశ్వర్లు, మోటూరి మధు, పాఠశాల అధ్యక్షుడు డాక్టర్ మనోహర్, ప్రధాన ఆచార్యులు చిలుక గట్టు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ తీగలు

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 5: ఎల్లారెడ్డిపేట మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలోని మూడో వార్డులో విద్యుత్ తీగలు చెట్ల కొమ్మలపై నుంచి వెళ్లడంతో ప్రమాదకంగా మారాయి. చిన్నపాటి గాలి వీస్తే తీగలు ఒకదానికొకటి తగిలి నిప్పురవ్వలు ఎగిసి పడుతున్నాయి. విద్యుత్ సరఫరా నిలిచిపోయి అంధకారం నెలకొంటోంది. పలుమార్లు సెస్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని కాలనీవాసులు వాపోతున్నారు. గాలి వీస్తే గండంలా మారుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించాలని, చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

రైతులపై కేసీఆర్ కపట ప్రేమ

- రైతులకు క్షమాపణ చెప్పాలి
- చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

బోయినపల్లి, ఏప్రిల్ 5: మాజీ సీఎం కేసీఆర్ రైతులపై కపట ప్రేమను చూపిస్తున్నారని, పొలంబాట పట్టడం హాస్యాస్పందంగా ఉందని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. శుక్రవారం బోయినపల్లిలో మీడియా సమావేశంలో మాట్లాడారు. నియోజకవర్గంలోని పంటలకు గాయత్రి పంప్‌హౌస్ నుంచి వరద కాలువకు నీరందించి రైతులను సమయానికి ఆదుకున్నామన్నారు. కేసీఆర్ రైతులపై పదేళ్లుగా కపట ప్రేమ ఒలకబోస్తూ నీచ రాజకీయాలు చేశారన్నారు. కేసీఆర్ కుటుంబంపై వస్తున్న ఆరోపణలను మళ్లించేందుకు పొలంబాట కార్యక్రమాన్ని ఎత్తుకున్నారని, దీనిని ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. కేసీఆర్‌లా సీఎం రేవంత్‌రెడ్డి చిల్లర రాజకీయాలు చేయడం లేదన్నారు. నియోజకవర్గంలో గతేడాది వడగళ్ల బాధితులను పరామర్శించిన కేసీఆర్ ఎకరాకు రూ.10 వేలు పరిహారం ఇస్తామని మాట తప్పారన్నారు. నియోజకవర్గంలో రైతులను ఓదార్చే నైతికహక్కు లేదన్నారు. అధికారంలో ఉన్నన్ని రోజులు నియంతలా పాలించిన నయా రజాకార్ చంద్రశేఖర్‌రావు క్షేత్ర స్థాయి పర్యటనకు రావడం చూస్తుంటే హంతకుడే సంతాప సభ పెట్టినట్లు ఉందన్నారు. ఇచ్చిన హామీలు నెరవేర్చనందుకు ముందుగా కేసీఆర్ రైతులకు భేషరతుగా క్షమాపణ చెప్పాలన్నారు. ఇప్పుడేమో ఎన్నికల కోసం రైతులపై ప్రేమ పెరగడం విడ్డూరంగా ఉందన్నారు. కమీషన్లకు కక్కుర్తిపడి రైతులు ఏడుస్తున్నా అదనపు టీఎంసీ పేరుతో భూములు లాక్కున్నారన్నారు. పదేళ్లలో రైతు బంధు తప్ప రైతులకు అందించే అన్ని సబ్సిడీ పరికరాల పనిముట్లను ఎత్తివేశారన్నారు. ఇప్పటికైనా బీఆర్ఎస్ నాయకులు వారి తీరును మార్చుకోవాలన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు కూస రవీందర్, గంగాధర, చొప్పదండి, రామడుగు, కొడిమ్యాల, బోయినపల్లి మండల అధ్యక్షుడు ఇప్ప శ్రీనివాసరెడ్డి, పురుమల్ల మనోహర్, బొమ్మనవేణి తిరుపతి, చిలువేరి నారాయణ, వన్నెల రమణారెడ్డి, మాజీ జడ్పీటీసీ పులి లక్ష్మీపతిగౌడ్, నాయకులు ఎనుగుల కనకయ్య, బండి శ్రీనివాస్, తడగొండ ఎంపీటీసీ ఉయ్యాల శ్రీనివాస్‌గౌడ్, నిమ్మ వినోద్ రెడ్డి పాల్గొన్నారు.



బోయినపల్లిలో మాట్లాడుతున్న మేడిపల్లి సత్యం

బోయినపల్లిలో కేసీఆర్ పొలంబాట



బస్సు దిగుతున్న కేసీఆర్

బోయినపల్లి, ఏప్రిల్ 5: బీఆర్ఎస్ అధ్యక్షుడు, మాజీ సీఎం కే చంద్రశేఖర్‌రావు బోయినపల్లి మండల కేంద్రంలోని ఎండిన పంట పొలాలను శుక్రవారం పరిశీలించారు. మిడ్ మానేరు ముంపు గ్రామమైన చీర్లవంచకు చెందిన గంగు రమేష్ అనే వ్యక్తి బోయినపల్లిలో అద్దెకు ఉంటూ గ్రామానికి చెందిన బొటుకు కనకయ్య, కనపర్తి ప్రభాకర్‌కు చెందిన పదెకరాల భూమిని కౌలుకు తీసుకొని వరి సాగు చేశాడు. దానిలోని 8 ఎకరాల పొలం ఎండిపోయింది. అంతేకాకుండా గ్రామానికి చెందిన జెర్రిపోతుల నాగరాజు, సుధాకర్ పంటలు ఎండిపోగా రమేష్ పంటను కేసీఆర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఎండిన పంటలను, దీన స్థితిలో ఉన్న రైతులను చూసి కేసీఆర్ ఆవేదనకు గురయ్యారు. ఈ సందర్భంగా ఎల్లంపల్లి నీరు రాకపోవడంతోనే భూగర్భ జలాలు అడుగంటి తమ పంటలు ఎండిపోయాయని రైతులు కేసీఆర్ ఎదుట గోడు వెళ్లబోసుకున్నారు. అనంతరం సిరిసిల్లకు వెళ్తున్న క్రమంలో శాభాష్‌పల్లి వంతెనపై మిడ్ మానేరులో నీటి నిల్వ తగ్గడంతో తేలిన శాభాష్‌పల్లి, కొదురుపాక గ్రామాన్ని పరిశీలించారు. సీఎం కేసీఆర్ వెంట మాజీ మంత్రి కేటీఆర్, జడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణరాఘవరెడ్డి, జనగామ ఎమ్మెల్యే పల్ల రాజేశ్వర్‌రెడ్డి, కరీంనగర్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి వినోద్‌కుమార్, మాజీ ఎమ్మెల్యేలు సుంకె రవిశంకర్, బాల్క సుమన్, జడ్పీటీసీ కత్తెర పాక ఉమ కొండయ్య, నాయకులు చెన్నాడి అమిత్‌రావు, కొనకటి లచ్చిరెడ్డి, మాజీ ఎంపీపీలు సత్తినేని మాధవ్, భాగ్యలత, నియోజకవర్గంలోని వివిధ మండలాలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

కేసీఆర్ పర్యటనలో జేబు దొంగల చేతివాటం

బోయినపల్లిలో కేసీఆర్ పొలంబాటలో జేబు దొంగలు చేతి వాటం ప్రదర్శించారు. రామన్నపేట గ్రామానికి చెందిన గూడి తిరుపతిరెడ్డికి చెందిన రూ.10 వేలు, రత్నంపేట గ్రామానికి చెందిన బక్తపురం నగేష్‌కు చెందిన మొబైల్‌ఫోన్,భూతం స్వామికి చెందిన రూ.5,500 దొంగలు తస్కరించారు.



అడుగంటిన మిడ్‌మానేరు పరిశీలిస్తున్న కేసీఆర్

ఒకరి రిమాండ్

కోనరావుపేట ఏప్రిల్ 5: కోనరావుపేట మండలం మామిడిపల్లి గ్రామంలో బుధవారం అర్ధరాత్రి తలుపులు కొడుతూ వస్తువులను ధ్వంసం చేసిన వ్యక్తిని అరెస్ట్ చేసి రిమాండ్ పంపినట్లు కోనరావుపేట ఎస్సై ఆంజనేయులు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. చందుర్తి మండలం ఎన్గల్‌కు చెందిన రాజేష్ బుధవారం అర్ధరాత్రి మామిడిపల్లిలోని పలు దుకాణాల డోర్ కొట్టి భయభ్రాంతులకు గురి చేశాడు. రిఫ్రిజిరేటర్‌లను ధ్వంసం చేశాడు. బాధితుల ఫిర్యాదుతో రాజేష్‌ను అరెస్ట్ చేసినట్లు, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

వాగులో పడి కార్మికుడి మృతి

- అనాథలైన ఇద్దరు కుమారులు

మెట్‌పల్లి రూరల్, ఏప్రిల్ 5: మండలంలోని చౌలమద్ది గ్రామంలోని బ్రిడ్జి నిర్మాణ పనుల కోసం వచ్చి పూజారి శ్రీనివాస్(30) అను కార్మికుడు వాగులో పడి శుక్రవారం మృతి చెందాడు. గ్రామస్థులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..ఆసిఫాబాద్ జిల్లా రెబ్బెన గ్రామానికి చెందిన శ్రీనివాస్ కూలి పనులు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. శ్రీనివాస్ భార్య మృతి చెందడంతో తన ఇద్దరు పిల్లలతో కలిసి పని చేసుకుంటున్నాడు. చౌలమద్ది గ్రామంలోని వాగుపై బ్రి డ్జి నిర్మాణంలో తోటి కూలీలతో కలిసి పనికి వచ్చాడు. ఈ క్రమంలో శుక్రవారం సాయంత్రం వాగులో తోటి కూలీలతో కలిసి స్నానం చేస్తుండగా ప్రమాదవశాత్తు నీటిలో మునిగిపోయాడు. గమనించిన కూలీలు కాపాడే ప్రయత్నం చేసినా ఫలితం లేకుండా పోయింది. అప్పటికే శ్రీనివాస్ నీటిలో మునిగి మృతి చెందాడు. తల్లి, దండ్రిని ఇద్దరిని కోల్పోయిన ఆ ఇద్దరు పిల్లలు అనాధాలుగా మిగిలారు.

రైలు నుంచి పడి ఒకరి మృతి

జమ్మికుంట రూరల్, ఏప్రిల్ 5: జమ్మికుంట రైల్వే గేట్ సమీపంలో శుక్రవారం గుర్తు తెలియని వ్యక్తి రైలు నుంచి పడి మృతి చెందాడు. మృతుడి వయస్సు 35-40సంవత్సరాల మధ్య వయస్సు ఉంటుంది. మృతుడి వద్ద ఎలాంటి గుర్తింపు కార్డులు లేవు. గుర్తు తెలియని రైల్లో నుంచి పడటం వల్లే మృతి చెంది ఉంటాడని రైల్వే పోలీస్‌లు ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని రామగుండం రైల్వే హెడ్ కానిస్టేబుల్ జి తిరుపతి తెలిపారు.

అనారోగ్యంతో మహిళ ఆత్మహత్య

గన్నేరువరం, ఏప్రిల్ 5: మండలంలోని గుండ్లపల్లి గ్రామానికి చెందిన వేములవాడ స్వప్న(32) అనారోగ్యంతో మనస్తాపం చెంది శుక్రవారం ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. స్వప్న తల్లి కలవ్వ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తాండ్ర నరేష్ తెలిపారు.

రాజ్యాంగాన్ని మార్చాలని చూస్తే సహించం

- తెలంగాణ మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్

సుభాష్‌నగర్, ఏప్రిల్ 5: రాజ్యాంగాన్ని మార్చాలని చూస్తే సహించేది లేదని, మేము మిమ్మల్ని మార్చేస్తామని తెలంగాణ మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ అన్నారు. పిల్లి సుధాకర్ చేపట్టిన రాజ్యాంగ రక్షణ యాత్ర శుక్రవారం కరీంనగర్‌కు చేరుకుంది. నగరంలోని కోర్టు చౌరస్తాలో స్థానిక నాయకులు యాత్రకు స్వాగతం పలికారు. సుధాకర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం మూలస్థంభాలుగా డాక్టర్ బిఆర్ అంబేడ్కర్ రాజ్యాంగాన్ని రూపొందించారన్నారు. అది నచ్చని మనువాద, మతతత్వ పార్టీలు ఈ ఎన్నికల్లో 400 సీట్లు ఇస్తే రాజ్యాంగాన్ని మారుస్తామని చెప్పడం సిగ్గుచేటన్నారు. అదే జరిగితే మౌలిక సుత్రాల పునాదులు ధ్వంసం అవుతాయని, జీవించే హక్కు, మాట్లాడే హక్కు కోల్పోతామన్నారు. ప్రతీ పౌరుడు ఈ చర్యను ఖండించాలన్నారు. అంబేడ్కర్ అందించిన ఓటు హక్కుతో బుద్ధి చెప్పాల్సిన బాధ్యత మన అందరిపై ఉందన్నారు. మాలలు అప్రమత్తంగా ఉండి ఇలాంటి కుట్రలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు కాడె శంకర్, రాష్ట్ర ప్రధానాకార్యదర్శి మేడి అంజయ్య, కార్యదర్శి గూడ కనకయ్య, రాష్ట్ర ప్రచార కార్యదర్శి తాళ్ళ వెంకటేష్, యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేడి మహేశ్, కార్పొరేటర్ గంట కళ్యాణి, శ్రీనివాస్, దామెర సత్యం, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎలుక ఆంజనేయులు, మహిళ నాయకురాళ్ళు తీట్ల ఈశ్వరి, ఎలుక దేవయ్య, వెన్న రాజు, కె చందరయ్య, మొగురం రమేశ్, ప్రసాద్, రామచంద్రం, సత్యం, పి భూమ య్య, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 5: ఎల్లారెడ్డిపేట మండలం దుమాల గ్రామ శివారులోని ఎల్లమ్మ ఆలయం సమీపంలో శుక్రవారం రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ సంఘటనలో అక్కపల్లి గ్రామానికి చెందిన పోతుల గాంధీబాబు, మందాటి సురేశ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. గాంధీబాబు తన బైక్‌పై అక్కపల్లి నుంచి ఎల్లారెడ్డిపేట వైపుకు వస్తున్న క్రమంలో ఇటు నుంచి ద్విచక్రవాహనంపై వెళుతున్న అదే గ్రామవాసి సురేశ్ వాహనం ఎదురెదురుగా ఢీకొన్నాయి. గాంధీబాబు రెండు కాళ్లు విరిగిపోయాయి. సురేశ్‌కు గాయాలయ్యాయి. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వివరించారు.

బస్టాండ్‌లో మహిళ వద్ద బంగారం చోరీ

జగిత్యాల టౌన్, ఏప్రిల్ 5: జగిత్యాల జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్‌లో బస్సు కోసం వేచి ఉన్న ఓ ప్రయాణికురాలి నుంచి శుక్రవారం 15 తులాల బంగారాన్ని దొంగలు అప హరించారు. మెట్‌పల్లి పట్టణంలోని వెల్లుల్ల రోడ్ ప్రాంతానికి చెందిన సురిగి మంగారాణి తన కూతురుతో కలిసి బీర్‌పూర్ మండల కేంద్రంలో జరిగిన శుభకార్యానికి హాజరయ్యారు. తిరిగి మెట్‌పెల్లికి వెళ్లేందుకు కొత్త బస్టాండ్ చేరుకుని బస్సు కోసం వేచి ఉన్న సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు మాటల్లోకి దింపి బ్యాగులో ఉన్న 15 తులాల బంగారు నగలను అపహరించారు. తేరుకున్న మంగారాణి తన బ్యాగులో ఉన్న బంగారం చోరీకి గురైందని తెలుసుకుని జగిత్యాల పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. టౌన్ సీఐతో పాటు ఎస్సై తన సిబ్బందితో బస్టాండ్‌లో ఉన్న సీసీ పుటేజీలను పనిశీలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

గర్షకుర్తిలో కిడ్నాప్ కలకలం

గంగాధర, ఏప్రిల్ 5: గర్షకుర్తి వాసి కిడ్నాప్‌నకు గురయ్యాడని సోషల్ మీడియాలో వైరల్ కావడం మండలంలో కలకలం రేపింది. కిడ్నాప్‌కు గురైన వ్యక్తిని గుర్తు తెలియని వ్యక్తులు కొట్టి అడవి ప్రాంతంలో పడేసినట్లు వీడియోలు వాట్సప్ గ్రూపుల్లో వైరల్‌గా మారాయి. గర్షకుర్తికి చెందిన బూత్కురి దావీదు (35) గ్రామంలో సీఏగా పని చేస్తున్నాడు. కాగా మూడు రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లినట్లు సమాచారం. శుక్రవారం నిర్మల్ నుంచి జగిత్యాల వెళ్లే రహదారి పక్కన అటవీ ప్రాంతంలో అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. అటువైపు నుంచి జగిత్యాల వస్తున్న ఓ ట్రాలీ వాహనం యాజమాని దావీదును గుర్తించి ఎవ్వరని ప్రశ్నించాడు. తమది గంగాధర మండలం గర్షకుర్తి అని తనను కిడ్నాప్ చేశారని దావీదు చెప్పాడు. దావీదును వాహన యాజమాని జగిత్యాలకు తీసుకు వచ్చి అతడి బంధువులకు సమాచారం అందించాడు. ప్రస్తుతం దావీదు అతని బావ వద్ద ఉన్నట్లు తెలిసింది. దీనిపై ఎస్సై కిరణ్ రెడ్డిని వివరణ కోరగా గర్షకుర్తిలోని దావీదు ఇంటికి పంపించి వివరాలు సేకరిస్తున్నామని చెప్పారు. కిడ్నాప్‌కు గురైనట్లు దావీదు చెప్పుతున్న వీడియోలు వాట్సప్‌లో వైరల్ అయ్యాయని తెలిపారు. ప్రస్తుతం ఆయన జగిత్యాలలోని అతని బావ వద్ద ఉన్నాడని వివరించారు. అసలు కిడ్నాప్‌నకు గురైయ్యాడా, లేక ఏమైందనే విషయంపై ఆరాతీస్తున్నామని, అనుమానం ఉంటే ఫిర్యాదు చేస్తే దర్యాప్తు చేస్తామని ఎస్సై తెలిపారు.

కొనసాగుతున్న జేఈఈ మెయిన్స్


తిమ్మాపూర్‌లో జేఈఈ పరీక్ష రాసేందుకు వెళుతున్న విద్యార్థులు

తిమ్మాపూర్, ఏప్రిల్5: రెండో విడత జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్ జేఈఈ మెయిన్ పరీక్షలు శుక్రవారం ప్రశాంతంగా కొనసాగాయి. అభ్యర్థులను పరీక్ష సమయానికి రెండు గంటల ముందు నుంచే పరీక్ష కేంద్రంలోనికి అనుమతించారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 వరకు మొదటి షిఫ్టు, మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 6గంటల వరకు రెండు షిఫ్టులలో ఈ పరీక్షలు జరుగుతున్నాయి. శుక్రవారం జిల్లా వ్యాప్తంగా కేవలం మండల కేంద్రలోని ఐయాన్ డిజిటల్ జోన్ ఒక్క పరీక్ష కేంద్రాంలోనే జరిగాయి. మొదటి షిఫ్టులో 678 మందికి 612 మంది, రెండో షిఫ్టులో 677 మందికి 620 మంది విద్యార్థులు హాజరయ్యారని ఎన్‌టీఏ సిటీ కోఆర్డినేటర్ డాక్టర్ లలితకుమారి తెలిపారు.

కాంగ్రెస్‌లో చేరిన మాజీ ఎమ్మెల్యే


మాజీ ఎమ్మెల్యేకు కాంగ్రెస్ పార్టీ కండువా వేస్తున్న దీప్‌దాస్‌మున్షీ

కరీంనగర్ అర్బన్, ఏప్రిల్ 5: మాజీ ఎమ్మెల్యే కోడూరి సత్యనారాయణ గౌడ్ కాంగ్రెస్ పార్టీలో శుక్రవారం చేరారు. ఏఐసీసీ కార్యదర్శి రోహిత్‌చౌదరి సమక్షంలో, రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆధ్వర్యంలో కాంగ్రెస్‌పార్టీ తెలంగాణ వ్యవహారాల ఇన్‌చార్జి దీప్‌దాస్‌మున్షీ హైదరాబాద్‌లో మాజీ ఎమ్మెల్యే కోడూరి సత్యనారాయణగౌడ్, బీసీ సంఘం నేత బూస అంజయ్య యాదవ్‌ను పార్టీ కండువా కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా సత్యనారాయణగౌడ్ మాట్లాడుతూ టీపీసీసీ అధ్యక్షుడు, సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలో అమలు చేస్తున్న ఆరు గ్యారంటీల సంక్షేమ పథకాలు, దేశ సమైక్యత కోసం సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ ఆధ్వర్యంలో కాంగ్రెస్‌పార్టీ అనుసరిస్తున్న సిద్ధాంతాలకు ఆకర్షితులై కాంగ్రెస్‌పార్టీలో చేరానని ప్రకటించారు. కార్యక్రమంలో ఏఐసీసీ సెక్రటరి విష్ణునాథ్, చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి, మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్, రాష్ట్ర ఓబీసీ సెల్ సమన్వయకర్త బద్దికుంట శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

ఇరుకుల్లలో అగ్నిప్రమాదం

- కాలిన సపోటా చెట్లు

- రూ. 20 లక్షల మేర నష్టం అంచనా

కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 5: కరీంనగర్ రూరల్ మండలం ఇరుకుల్ల గ్రామంలో పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డికి చెందిన సపోటా తోటలో శుక్రవారం మధ్యాహ్నం అగ్నిప్రమాదం జరిగింది. అక్కడ ఉన్న వాచ్‌మన్ భోజనానికి వెళ్లిన సమయంలో మంటలు అంటుకుని చెట్లు దగ్ధమయ్యాయని కరీంనగర్ ఫైర్ ఆఫీసర్ పరమేశ్వర్ తెలిపారు. మధ్యాహ్నం సమయంలో సపోటా తోటలో అగ్నిప్రమాదం జరిగినట్లు సమాచారం అందుకున్న వెంటనే ఫైరింజన్‌తో సహా సంఘటనా స్థలానికి చేరుకుని మంటలు అదుపులోకి తీసుకవచ్చామని తెలిపారు. అగ్నిప్రమాదానికి కారణాలు తెలియలేదని, విచారణ జరుపుతున్నామని అన్నారు. సపోటా చెట్లకు మంటలు అంటుకోవటంతో చెట్లు భారీగానే కాలిపోయాయని తెలిపారు. సుమారు 20 లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు అంచనా వేస్తున్నామని అన్నారు. సుమారు 10 ఎకరాలలో సపోటా చెట్లు ఉన్నట్లు తెలిపారు.

● వస్త్ర దుకాణంలో..

కరీంనగర్ క్రైం: కరీంనగర్ టవర్ ప్రాంతంలోని ఒక వస్త్ర దుకాణంలో శుక్రవారం ఉదయం 5 గంట ల సమయంలో అగ్నిప్రమాదం జరిగింది. భువన కిడ్స్ షాపులో మంటలు అంటుకోవటంతో స్థానికులు కరీంనగర్ ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించారు. వెంటనే ఫైర్ ఇంజన్‌తో సంఘటనా స్థలానికి చేరుకున్న అగ్నిమాపకశాఖ సిబ్బంది మంటలను ఆర్పివేశారు. విద్యుత్‌షార్ట్‌సర్క్యూట్ కారణంగానే మంటలు అంటుకున్నాయని, ఈ ప్రమాదంలో కొన్ని దుస్తుల, బ్యాంగిల్స్ కాలిపోయాయని ఫైర్ ఆఫీసర్ పరమేశ్వర్ తెలిపారు. సంఘటనపై విచారణ జరుపుతున్నామని అన్నారు. తిమ్మాపూర్ మండలం రామకృష్ణకాలనీలో రోడ్డు పక్కన మంటలు అంటుకున్నాయని వచ్చిన సమాచారం మేరకు ఫైరింజన్‌తో మంటలను ఆర్పివేశామని ఫైర్ ఆఫీసర్ తెలిపారు.


కాలిపోయిన సపోటా చెట్లు

ప్రమాదంలో ప్రజాస్వామ్యం

- బీఎస్పీ సెంట్రల్ కో-ఆర్డినేటర్ ఎం బాలయ్య


మాట్లాడుతున్న ఎం బాలయ్య

సుభాష్‌నగర్, ఏప్రిల్ 5: కేంద్రంలో బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తే బహుజనులు శాశ్వత బానిసలు అవుతారని, ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడుతుందని బహుజన సమాజ్ పార్టీ సెంట్రల్ కో ఆర్డినేటర్ ఎం బాలయ్య అన్నారు. శుక్రవారం స్థానిక రెవెన్యూ గార్డెన్‌లో ఉమ్మడి జిల్లా సమీక్ష సమావేశాన్ని నిర్వ హించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్ముడుపోని నాయకులు కావాలని అన్నారు. వారు మాత్రమే బహుజన ఉద్యమాన్ని ముందుకు తీసుకుపోతారని, అందుకే అమ్ముడుపోని నాయకులు, కార్యకర్తలను తయారు చేసుకోవాలన్నారు. కార్యకర్తలే బహుజన ఉద్యమానికి వనరులు ఇస్తారని అన్నారు. కేంద్రంలో అధికారంలో అధికారంలో ఉన్న బీజేపీ ఎలక్టోరల్ బాండ్ల పేరిట కార్పొరేట్ కంపెనీల నుంచి వేలకోట్ల రూపాయలు తీసుకొని ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తోందని ఆరోపించారు. బహుజన ఉద్యమం ఉన్నత విద్యావంతులకు అర్థం కాకపోవడం బాధాకరమని వాపోయారు. నేడు దేశంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో ఉందన్నారు. రాజ్యాంగాన్ని మనం కాపాడుకోవాలని అన్నారు. రాజ్యాంగాన్ని మారిస్తే బీసీలు బానిసలు కారా? అని బీజేపీ నాయకులను ప్రశ్నించారు. తెలంగాణలో కరీంనగర్‌కు ఒక ప్రత్యేక స్థానం ఉందన్నారు. ఇక్కడ ఎన్నో ఉద్యమాలు పుట్టాయని, అందులో జగిత్యాల జైత్రయాత్ర, సాయుధ రైతాంగ పోరాటాలు ఇక్కడే పురుడు పోసుకున్నాయన్నారు. దేశంలో బీజేపీ, కాంగ్రెస్, కమ్యూనిస్టు పార్టీలు అన్ని ఒక్కటే అని అన్నారు. కాంగ్రెస్ వారు లౌకిక వాదులు కానేకారని అన్నారు. బీఎస్పీకి తప్ప ఇతర పార్టీకి ఓటేసినా బీజేపీ అధికారంలోకి వస్తుందన్నారు. బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు మంద ప్రభాకర్ మాట్లాడుతూ ప్రస్తుత పార్లమెంట్ ఎన్నికల్లో 400 సీట్లు ఇవ్వండి మేము రాజ్యాంగాన్ని మారుస్తామని బీజేపీ నాయకులు బాహాటంగా మాట్లాడుతున్నారన్నారు. బహుశా ఇవే చివరి ఎన్నికలేమో అని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు దొడ్డె శ్రీనివాస్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు, కరీంనగర్ పార్లమెంట్ ఇన్‌చార్జీ అంకని భాను, నిషాని రామచంద్రం, పుప్పాల లింబాద్రి, రాష్ట్ర కార్యదర్శి ఎనగందుల వెంకన్న, దొడ్డె సమ్మయ్య, రంగు సంపత్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నల్లాల శ్రీనివాస్, జగిత్యాల ఇన్‌చార్జి చిర్ర శంకర్, పెద్దపల్లి పార్లమెంట్ ఇన్‌చార్జి క్యాదాసి రవీందర్, పెద్దపల్లి ఇన్‌చార్జి వరికిళ్ళ మల్లేశ్, బాలకల్యాణ్, జిల్లా అధ్యక్షుడు రాజనర్సయ్య, సిరిసిల్ల జిల్లా ఇన్‌చార్జి చాకలి రమేశ్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ రైతు మృతి

- 4న పురుగుల మందుతాగి ఆత్మహత్యాయత్నం


ముత్తయ్య(ఫైల్)

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 5: ఈ నెల 4న పురుగుల మందుతాగి ఆత్మహత్యకు యత్నించి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సిరిపురం ముత్తయ్య (58) అనే రైతు పరిస్థితి విషమించి శుక్రవారం మృతి చెందాడు. కుటుంబ సభ్యులు, పోలీసుల కథనం మేరకు.. ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్‌కు ముత్తయ్య తనకున్న 30 గుంటల భూమిలో వ్యవసాయం చేయడంతోపాటు స్థానికంగా భవన నిర్మాణ కార్మికుడిగా పని చేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. ఉన్న ఊరిలో ఉపాధి లేకపోవడంతో ఏడాది కిందట రూ.2 లక్షలు అప్పు చేసి కొడుకు శ్రీనివాస్‌ను బహ్రెయిన్ పంపించాడు. మరో రూ.2 లక్షలు అప్పులు చేసి ఇంటి నిర్మాణం చేపట్టాడు. చేతిలో డబ్బులు లేకపోవడంతో ఇంటి నిర్మాణం అర్ధంతరంగా నిలిచిపోయింది. పనులు లభించక కుటుంబ పోషణ భారంగా మారింది. అప్పులు తీర్చే మార్గం కానరాకపోవడంతో మనస్తాపం చెందాడు. ఈ నెల 4న పొలం వద్ద పురుగుల మందు తాగాడు. గమనించిన చుట్టు పక్కల రైతులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. అపస్మారక స్థితిలో పడి ఉన్న ముత్తయ్యను మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. కన్నకొడుకు గల్ఫ్ దేశంలో ఉండడంతో భర్తకు భార్య దేవలక్ష్మీ అంతిమ సంస్కారాలు నిర్వహించడం స్థానికులను కంట తడి పెట్టించింది. మృతుడి భార్య దేవలక్ష్మీ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అక్రమంగా నిల్వచేసిన 21 క్వింటాళ్ల గన్‌పౌడర్ పట్టివేత

సైదాపూర్, ఏప్రిల్ 5: సైదాపూర్ మండలంలోని జాగీర్‌పల్లి గ్రామ శివారులో సమాచారం మేరకు ఓ రూంలో అక్రమంగా నిల్వ చేసిన 21.30క్వింటాళ్ల గన్ పౌడర్‌ను హుజూరాబాద్ ఏసీపీ శ్రీనివాస్‌జీ ఆధ్వర్యంలో పోలీసులు శుక్రవారం పట్టుకున్నారు. ఏసీపీ శ్రీనివాస్‌జీ మాట్లాడుతూ హుజూరాబాద్‌కు చెందిన మహేందర్ అనే వ్యక్తి జాగీర్‌పల్లి శివారులోని ఎలాంటి అనుమతులు లేకుండా ఓ రూంలో గన్‌పౌడర్ దాచాడనే సమాచారం మేరకు తనిఖీ చేశామన్నారు. అందులో 142 బాక్సులలో గన్ పౌడర్ ఉందన్నారు. దాని విలువ సుమారు రూ. 74,764 ఉంటుందని వారు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏసీపీ తెలిపారు. ఈ గన్‌పౌడర్‌ను క్వారీలలో శబ్దం రాకుండా బండ పగుల గొట్టడానికి ఉపయోగిస్తారని, దీన్ని పూర్తి అనుమతులతోనే ఉపయోగించాల్సి ఉంటుదని స్థానికంగా చర్చించుకుంటున్నారు. కార్యక్రమంలో హుజూరాబాద్ రూరల్ సీఐ వెంకట్, సైదాపూర్ ఎస్సై జన్ను ఆరోగ్యం, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

8న మెడికల్ కాలేజీలో వాక్ ఇన్ ఇంటర్వ్యూ

సుభాష్‌నగర్, ఏప్రిల్ 5: కొత్తపల్లిలోగల ప్రభుత్వ మెడికల్ కాలేజీలో కాంట్రాక్టు పద్ధతిపై ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్, సీనియర్ రెసిడెంట్ పోస్టుల భర్తీ కోసం ఈనెల 8న వాక్ ఇన్ ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మీనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు కాలేజీ వెబ్‌సైట్‌లోగల అప్లికేషన్ ఫారం డౌన్‌లోడ్ చేసుకొని వివరాలు పూరించి ఈనెల ఏడో తేదీలోగా కొత్తపల్లిలోని ప్రభుత్వ మెడికల్ కాలేజీలో రెండు సెట్ల జిరాక్స్ కాపీలతో సమర్పించాలని కోరారు. ఈనెల 8న ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కాలేజీలో నిర్వహించే వాక్ ఇన్ ఇంటర్వ్యూకు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని కోరారు.

మొక్కజొన్న పంట దగ్ధం


కాలిపోయిన మొక్కజొన్న పంట

సైదాపూర్, ఏప్రిల్ 5: మండలంలోని గొడిశాల గ్రామ శివారులో ప్రమాదవశాత్తు నిప్పంటుకొని తాడూరి రాజకుమార్ అనే రైతు కోతకు వచ్చిన రెండెకరాల మొక్కజొన్న పూర్తిగా కాలిపోయిది. స్థానికులు, బాధిత రైతు తెలిపిన వివరాల ప్రకారం.. మధ్యాహ్నం వేళలో 11కేవీ వైర్ల రాపిడికి నిప్పు రవ్వలు కోతకు వచ్చిన మొక్కజొన్నలో పడడంతో మంటలు అంటుకున్నాయి. గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకొని చుట్టు పక్కల పంటలలోకి వెళ్లకుండా మంటలు ఆర్పారు. మంటలు ఆర్పే క్రమంలో రాజ్‌కుమార్ భార్య స్పృహ తప్పి పడిపోయిందని తెలిపారు. రెండకరాల మొక్కజొన్న దెబ్బతినడంతో తనకు సుమారు రూ. 1.50లక్షల వరకు నష్టం వచ్చిందని రైతు తెలిపారు. ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

తిమ్మాపూర్, ఏప్రిల్ 5: మండలంలోని నుస్తులాపూర్ వద్ద రాజీవ్ రహదారిపై రోడ్డు దాటుతున్న వ్యక్తిని ఓ ప్రయివేటు బస్సు ఢీ కొట్టగా తీవ్రగాయలై అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్‌లోని రామచంద్రపూర్ కాలనీకి చెందిన చిక్యాల సాగర్‌రావు(69) కారులో హుస్నాబాద్ సమీపంలోని ఓ గ్రామంలో ఓ ఫంక్షన్‌కి స్నేహితులతో కలిసి వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో మండలంలోని నుస్తులాపూర్ వద్ద వాహనం నిలిపివేసి వాటర్ బాటిల్ కొనేందుకు స్నేహితులు ముగ్గురితో పాటు సాగర్ రావు రోడ్డు దాటుతున్నాడు. కరీంనగర్ నుంచి హైదారాబాద్ వైపు అతివేగంగా వచ్చిన ఓ ప్రైవేటు బస్సు రోడ్డు దాటుతున్న సాగర్‌రావును ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రగాయలతో సాగర్‌రావు అక్కడికక్కడే మృతి చెందాడు. సాగర్‌రావు(భార్య కుమారుడు, కూతురు ఉన్నారు. సాగర్‌రావు తపాలా కార్యాలయంలో పని చేసి పదవీ విరమణ పొందాడు. సంఘటన స్థలానికి ఎల్ఎండీ ఎస్సై చేరాలు చేరుకొని మృతదేహాన్ని కరీంనగర్ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆలయంలో చోరీకి పాల్పడిన ఇద్దరి అరెస్టు

దండేపల్లి, ఏప్రిల్ 5 : దండేపల్లి మండల కేంద్రంలోని మల్లన్న గుడిలో, అంబేద్కర్ చౌరస్తాలో ఆటోను దొంగిలించిన ఇద్దరు వ్యక్తులను శుక్రవారం అరెస్టు చేసినట్లు సీఐ అల్లం నరేందర్, ఎస్సై స్వరూప రాజ్ తెలిపారు. శుక్రవారం గూడెం ఫారెస్టు చెక్ పోస్ట్ వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా అనుమానాస్పదంగా ఆటోతో వచ్చిన తూర్పాటి కనకయ్య (రేకుర్తి కొత్తపల్లి, కరీంనగర్), పత్తి కనక రాజు (హనుమాన్‌నగర్, కరీంనగర్)లను అదుపులోకి తీసుకుని విచారించగా దొంగతనం చేసినట్లు ఒప్పుకున్నట్లు తెలిపారన్నారు. నిందితుల నుంచి ఒక ఆటో ట్రాలీ, ద్విచక్ర వాహనంతో పాటు మల్లన్న గుడిలో చోరీ చేసిన సొత్తును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

ఉరివేసుకొని యువకుడి ఆత్మహత్య


రుషి(ఫైల్)

వేములవాడ, ఏప్రిల్ 5: తల్లిని కొట్టాను అన్న పశ్చాత్తాపంతో యువకుడు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన వేములవాడలో చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని ఉప్పుగడ్డ వీధికి చెందిన నేరెళ్ల అంజయ్య - లక్ష్మి దంపతుల పెద్ద కుమారుడు నేరెళ్ల రుషి (18) తరచూ అర్ధరాత్రి దాటిన తర్వాత ఆలస్యంగా ఇంటికి వచ్చేవాడు. ఈ క్రమంలో గురువారం రాత్రి కూడా అర్ధరాత్రి దాటిన తర్వాత ఇంటికి వచ్చిన రుషిని తల్లి మందలించింది. తండ్రి తాడి చెట్టు పైనుంచి పడి తీవ్రంగా గాయపడి మంచాన పడగా ఇలా అర్ధరాత్రిలు రావడం ఏంటని ప్రశ్నించింది. తీవ్ర ఆగ్రహానికి లోనై విచక్షణ కోల్పోయిన రుషి తల్లితో పాటు తండ్రిపై దాడికి పాల్పడ్డాడు. అనంతరం అదే రాత్రి ఇంట్లో నుంచి వెళ్లిపోయిన రుషి శుక్రవారం తెల్లవారు జామున ఇంటి పైఅంతస్తుకు చేరుకొని తల్లిని కొట్టిన పశ్చాత్తాపంలో మనోవేదనకు లోనై ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తల్లి లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని వేములవాడ పట్టణ ఇన్‌చార్జి సీఐ శ్రీనివాస్ తెలిపారు.

సవతి తండ్రిని హత్య చేసిన తనయుడు


అంబాదాస్(ఫైల్)

మల్లాపూర్, ఏప్రిల్ 5: జల్సాలు మాని పని చేసుకోవాలని మందలించిన సవతి తండ్రిపై కోపం పెంచుకున్న తనయుడు శుక్రవారం హత్య చేశాడు. పోలీసులు, గ్రామ స్థులు తెలిపిన వివరాల ప్రకారం..మల్లాపూర్ దుర్గమ్మ కాలనీకి చెందిన అంబాదాస్ (54) తన రెండో భార్య బోజమ్మతో పాటు ఆమె కుమారుడు రవితేజతో కలిసి జీవిస్తున్నారు. రవితేజ పని చేయకుండా జల్సాలు చేసుకుంటూ తిరగడంతో అంబాదాస్ మందలించాడు. ఇలా రోజు ఇద్దరి మధ్య గొడవలు జరుగుతున్నాయి. అప్పటి నుంచి అంబాదాస్‌పై రవితేజ కోపం పెంచుకున్నాడు. శుక్రవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరు లేని సమయంలో పడుకొని ఉన్న అంబాదాస్‌పై పదునైన ఆయుధంతో మెడపై కొట్టి పారిపోయాడు. తలపై తీవ్ర గాయం కావడంతో అంబాదాస్ అక్కడికక్కడే మృతి చెందాడు. రక్తపు మడుగులో పడిఉన్న అంబాదాస్‌ను గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. మె ట్‌పల్లి డీఎస్పీ ఉమామహేశ్వరరావు, సీఐ నవీన్‌కుమార్, ఎస్సై కిరణ్‌కుమార్‌లు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకొన్నారు. ఈ మేరకు పరారీలో ఉన్న రవితేజ కోసం గాలిస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

సైబర్ వలలో మెట్‌పల్లి వాసి

మెట్‌పల్లి, ఏప్రిల్ 5: మెట్‌పల్లి పట్టణానికి చెందిన మొహమ్మద్ ఇమ్రాన్ సైబర్ మోసానికి గురైన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 3వ తేదీన సైబర్ మోసగాళ్లు ఇమ్రాన్‌కు ఫోన్ చేసి డిస్కౌంట్ల పేరుతో ఆఫర్ల ఆశ చూపడంతో ఇమ్రాన్ నమ్మాడు. కొంత సమయం తరువాత వారికి ఓటీపీలు చెప్పడంతో కాసేపటికి ఇమ్రాన్ అకౌంట్ నుంచి రూ. 27,440 కట్ అయినట్లు మెసేజ్ వచ్చింది. తరువాత వారికి ఫోన్ చేస్తే కలవకపోవడంతో మోసపోయినట్లు భావించి సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

కాంగ్రెస్‌లో చేరిన మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్

సిరిసిల్ల టౌన్, ఏప్రిల్ 5: సిరిసిల్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ భైరి ప్రభాకర్ కాంగ్రెస్‌లో చేరారు. శుక్రవారం సిరిసిల్ల పట్టణం శివనగర్ పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో బీఆర్ఎస్‌కు రాజీనామా చేసి కాంగ్రెస్ సిరిసిల్ల నియోజకవర్గం ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్, ప్రధాన కార్యదర్శి మ్యాన ప్రసాద్, జిల్లా ఉపాధ్యక్షుడు వంగ మల్లేశంగౌడ్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు, కౌన్సిలర్ భూక్య రెడ్యానాయక్, రైతు బంధు సమితి జిల్లా మాజీ అధ్యక్షుడు గడ్డం నర్సయ్య, సిరిసిల్ల అర్బన్ బ్యాంక్ మాజీ వైస్ చైర్మన్ కామినేని రవీందర్, మాజీ కౌన్సిలర్ యెల్లె లక్ష్మినారాయణ, నాయకులు గుజ్జె రమేష్, దొంతు దేవదాస్, ప్రశాంత్, అడ్డగట్ల శంకర్, అఫాన్, రఫీ జగన్ పాల్గొన్నారు.

ఘనంగా పెద్దమ్మ ఉత్సవాలు



ఉత్సవాల్లో పాల్గొన్న కేకే మహేందర్‌రెడ్డి

ముస్తాబాద్, ఏప్రిల్ 5: మండలంలోని పోతుగల్‌లో ముదిరాజ్ సామాజిక వర్గ ఆధ్వర్యంలో పెద్దమ్మ ఉత్సవాలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. సిరిసిల్ల కాంగ్రెస్ నియోజక వర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్ రెడ్డి ఉత్సవాలకు హాజరయ్యారు. మహిళలు పెద్ద ఎత్తున బోనాలు తీశారు. కాంగ్రెస్ నాయకులు బాల్ రెడ్డి, ఆంజనేయులు, శ్రీనివాస్, రాజు, రాజు, పెద్దిగారి శ్రీనివాస్, దేవరాజు, ముదిరాజ్ సామాజికవర్గ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ఎల్‌వోసీ అందజేత



ఎల్‌వోసీ అందజేస్తున్న నాయకులు

సిరిసిల్ల టౌన్, ఏప్రిల్ 5: అనారోగ్యంతో బాధపడుతున్న పేద యువకుడికి కాంగ్రెస్ నాయకులు శుక్రవారం ఎల్‌వోసీ అందజేశారు. సిరిసిల్ల పట్టణం అంబేద్కర్ నగర్‌కు చెందిన నక్క జోయల్ చాల రోజులుగా అనారోగ్యంతో ఖరీదైన వైద్యం చేయించుకోలేక బాధపడుతున్నాడు. వార్డు కౌన్సిలర్ ఆకునూరి విజయనిర్మల సహకారంతో వైద్యం కోసం ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకోగా రూ. 2లక్షల 10 వేల విలువ చేసే ఎల్‌వోసీ మంజూరైంది. కాంగ్రెస్ సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు జోయల్ తండ్రి సతీష్‌కు అందజేశారు. రైతు బంధు సమితి జిల్లా మాజీ అధ్యక్షుడు గడ్డం నర్సయ్య, సిరిసిల్ల మార్కెట్ కమిటి మాజీ వైస్ చైర్మన్ భైరి ప్రభాకర్, సిరిసిల్ల అర్బన్ బ్యాంక్ మాజీ వైస్ చైర్మన్ కామనేని రవీందర్, నాయకులు తుంగ శివరాజ్

వినోద్ కుమార్ వ్యాఖ్యలపై ఆగ్రహం

కోనరావుపేట, ఏప్రిల్ 5 : బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్‌పై కరీంనగర్ మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ వ్యాఖ్యలు చేయడంపై బీజేపీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కోనరావుపేట మండల కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీఆర్ఎస్ నేత, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ బండి సంజయ్ పై చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలన్నారు. ఇలాంటి వ్యాఖ్యలు చేస్తే ఊరుకోబోమని హెచ్చరించారు. ఈ సమావేశంలో బీజేపీ జిల్లా నాయకుడు గోపాడి సురేందర్ రావు, మండల అధ్యక్షుడు గొట్టే రామచంద్రం, వెలిశాల రవి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నేతల వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలి

చందుర్తి, ఏప్రిల్ 5 : భారత రాజ్యాంగాన్ని మార్చుతామన్న మాటలను బీజేపీ వెనక్కి తీసుకోవాలని మాల మహానాడు సంఘం మండల అధ్యక్షుడు నీరటి శ్రీనివాస్ అన్నారు. చందుర్తి మండల కేంద్రంలో శుక్రవారం రాజ్యాంగ రక్షణ యాత్ర పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ రాజ్యాంగాన్ని బీజేపీ నేతలు మారుస్తామనడం బాధాకర మన్నారు. రాజ్యాంగాన్ని మారుస్తామని మాట్లాడిన కేసీఆర్ కనబడకుండా పోయారన్నారు. బీజేపీకి కూడా అదే గతి పడుతుందన్నారు. కార్యక్రమంలో మండల మాల మహానాడు సంఘం నాయకులు సిరిగిరి సుధాకర్, ప్రదీప్, సంటి ప్రసాద్, వేల్పుల దేవస్వామి, నీరటి ప్రసాద్, బత్తుల కమలాకర్, సంటి బాబు పాల్గొన్నారు.

సీతారామాంజనేయ ఆలయ కమిటీ ఎన్నిక



నూతన పాలకవర్గం సభ్యులు

చందుర్తి, ఏప్రిల్ 5 : చందుర్తి మండలం లింగంపేట సీతారామాంజనేయ స్వామి ఆలయ కమిటీని శుక్రవారం ఎన్నుకున్నారు. ఆలయ కమిటీ చైర్మన్‌గా తర్రె చంద్రశేఖర్, వైస్ చైర్మన్‌గా వాసం నారాయణ, ప్రధాన కార్యదర్శిగా ఈగ శ్రీనివాస్, కోశాధికారిగా బందెల వెంకటేష్, కార్యదర్శిగా కొక్కుల నరేష్, అలవాల నర్సయ్య, లాండే సంతోష్, వెంకటేశ్వరరావు ఏనుగుల కృష్ణ ఎన్నికయ్యారు.

జగ్జీవన్‌రామ్ ఆశయ సాధనకు కృషి చేయాలి

సిరిసిల్ల టౌన్, ఏప్రిల్ 5: బాబు జగ్జీవన్‌రాం ఆశయాల సాధన కోసం కృషి చేయాలని అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ అన్నారు. శుక్రవారం జిల్లా వ్యాప్తంగా మాజీ ఉప ప్రధాన మంత్రి బాబు జగ్జీవన్‌రాం జయంతిని ఘనం గా నిర్వహించారు. సిరిసిల్ల పట్టణం అంబేద్కర్ చౌరస్తాలో ఎస్సీ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ ముందుగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేశారు. అనంతరం జగ్జీవన్‌రాం చిత్రపటం వద్ద జ్యోతి ప్రజ్వలను చేసి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల కోడ్‌కు అనుగుణంగా బాబు జగ్జీవన్‌రాం జయంతి అధికారికంగా నిర్వహించినట్లు చెప్పారు అంబేద్కర్ జయంతి కూడా కోడ్‌కు అనుగుణంగా నిర్వహించుకోవాలని సూచించారు. సిరిసిల్ల ఆర్డీవో రమేష్, జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఈడీ వినోద్‌కుమార్, టెక్స్‌టైల్, జౌళిశాఖ ఏడీ సాగర్, డీవైఎస్‌వో అజ్మీరా రాందాస్, ఎల్డీఎం మల్లికార్జున్‌రావు, డీటీసీపీవో అన్సారీ, జిల్లా కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్, తెలంగాణ అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు దేవదాస్ పాల్గొన్నారు.

● సిరిసిల్ల పట్టణం శివనగర్‌లోని కాంగ్రెస్ కార్యాలయంలో పార్టీ సిరిసిల్ల నియోజకవర్గం ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి, పార్టీ నాయకులు జగ్జీవన్‌రాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కాంగ్రెస్ సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్, ప్రధాన కార్యదర్శి మ్యాన ప్రసాద్, టీపీసీసీ సభ్యుడు నాగుల సత్యనారాయణ, సిరిసిల్ల బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సూర దేవరాజు, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు వంగ మల్లేశంగౌడ్, మహిళ జిల్లా అధ్యక్షురాలు కాముని వనిత, ప్రధాన కార్యదర్శి కల్లూరి చందన, కౌన్సిలర్లు కుడికాల రవికుమార్, భూక్య రెడ్యానాయక్, గుండ్లపల్లి రామానుజం, సిరిసిల్ల అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ నేరెళ్ల శ్రీకాంత్‌గౌడ్, రైతు బంధు సమితి జిల్లా మాజీ అధ్యక్షుడు గడ్డం నర్సయ్య సిరిసిల్ల అర్బన్ బ్యాంక్ మాజీ వైస్ చైర్మన్ కామినేని రవీందర్, మాజీ కౌన్సిలర్ యెల్లె లక్ష్మినారాయణ, నాయకులు పాల్గొన్నారు.

● సిరిసిల్ల పట్టణం విద్యానగర్ జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో జగ్జీవన్‌రాం చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. యువజన కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు చిందం శ్రీనివాస్, రాష్ట్ర అ దికార ప్రతినిధి రెడ్డిమల్ల భాను, నాయకులు పాల్గొన్నారు.

సర్దాపూర్ పోలీస్ బెటాలియన్‌లో..

సిరిసిల్ల రూరల్: తొలి కార్మిక శాఖ మంత్రి బాబు జగ్జీవన్‌రామ్ దేశానికి విశిష్ట సేవలను అందించారని 17వ పోలీస్ బెటాలియన్ కమాండెంట్ ఎం.శ్రీనివాసరావు అన్నారు. సిరిసిల్ల అర్బన్ పరిధిలోని సర్దాపూర్‌లోని 17వ పోలీస్ బెటాలియన్‌లో శుక్రవారం బాబు జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి కమాండెంట్ శ్రీనివాసరావు పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో హరిత విప్లవంతోపాటు వ్యవసాయాన్ని ఆధునికీకరించడంలో ఆయన చేసిన కృషి మరువలేమన్నారు. అసిస్టెంట్ కమాండెంట్‌లు, అధికారులు పాల్గొన్నారు.





సిరిసిల్లలో నివాళులర్పిస్తున్న అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్, చెక్కపల్లిలో విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్

ఇల్లంతకుంట : మండల కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో శుక్రవారం జగ్జీవన్‌రాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు రాజేశం, నియోజకవర్గ అధికార ప్రతినిధి పసుల వెంకటి, నాయకులు ఎలగందుల ప్రసాద్, జమాల్, మల్లేశం, రమేష్, బాబు, రజనీకాంత్, ప్రశాంత్, అనీల్, రాజయ్య, శేఖర్, బాబు, బాలయ్య పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట : ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతోపాటు గొల్లపల్లి, బొప్పాపూర్, దుమాల, రాజన్నపేట, వెంకటాపూర్, నారాయణపూర్ గ్రామాల్లో జగ్జీవన్‌రామ్ జయంతి నిర్వహించారు. మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ, జడ్పీటీసీ కార్యాలయాలతోపాటు గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో మాజీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, అధికారులు, దళిత సంఘాల నాయకులు నివాళులర్పించారు. గొల్లపల్లిలో జరుగుతున్న ఉపాధి పనుల వద్ద కూలీలు జగ్జీవన్‌రామ్ చిత్ర పటానికి పూలమాలలు వేశారు. జడ్పీటీసీ లక్ష్మణ్‌రావు, ఎంపీపీ రేణుక, ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు, నాయకులు పాల్గొన్నారు.

వీర్నపల్లి : వీర్నపల్లి మండలంలోని తహసీల్దార్, మండల పరిషత్ కార్యాలయాల్లో బాబు జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తహసీల్దార్ ఉమారాణి, నాయబ్ తహసీల్దార్ ప్రవీణ్ కుమార్, ఎంపీడీవో సత్తయ్య, ఎంపీవో నరేష్ కుమార్, అధికారులు పాల్గొన్నారు.

ముస్తాబాద్: ముస్తాబాద్ మండల కేంద్రంలో రాజీవ్ కూడలిలో బాబు జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. నాయకులు నల్లబాబు ఓరగంటి తిరుపతి, నడిమెల ఏళ్లం పాల్గొన్నారు.

వేములవాడ: జగ్జీవన్ రామ్ జయంతిని వేములవాడ పట్టణంలోని అంబేద్కర్ నగర్‌లో ఘనంగా నిర్వహించారు. అంబేద్కర్ సంఘం నాయకులు జగ్జీవన్‌రాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అంబేద్కర్ సంఘం నాయకులు, ప్రెస్ క్లబ్ ఉపాధ్యక్షుడు తాళపల్లి ప్రశాంత్, పెంట శివ ప్రసాద్, గుడిసె మల్లేష్, పెంట రాజేశం పాల్గొన్నారు.

● వేములవాడ కోర్టు ఆవరణలోని బార్ అసోసియేషన్ కార్యాలయంలో అధ్యక్షుడు గుడిసె సదానందం ఆధ్వర్యంలో జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అవధూత రజనీకాంత్, ఉపాధ్యక్షులు ప్రతాప సంతోష్, మాజీ అధ్యక్షులు పొత్తూరు అనిల్ కుమార్, పెంట రాజు, కే.విద్యాసాగర్ రావు, బొడ్డు ప్రశాంత్ కుమార్, పర్లపల్లి అంజయ్య, నక్క దివాకర్, గుజ్జె మనోహర్, మహిళ న్యాయవాదులు సుజాత, అన్నపూర్ణ ఉన్నారు.

వేములవాడ రూరల్: మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు శుక్రవారం మండలంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చెక్కపల్లి గ్రామంలో ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బండ మల్లేశం, ఎంపీటీసీలు వులెమ నర్సవ్వబాల్‌రెడ్డి, రంగు వెంకటేశం, బొడ్డు శంకరవ్వరాములు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సాగరం వెంకటస్వామి, రూరల్ మండల అధ్యక్షుడు వకులాభరణం శ్రీనివాస్, నాయకులు అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు ఎడపల్లి గంగరాజు, సభ్యులు ఎడపల్లి అనీల్, మహేష్, నాగరాజు, తలారి రవి, సురేష్, నాయకులు అడ్డిక జైపాల్‌రెడ్డి, తిరుపతి రెడ్డి, సోయినేని కరుణాకర్, పుల్కం రాజు, వంగపల్లి మల్లేశం, దానె కొమురయ్య పాల్గొన్నారు.

కోనరావుపేట : కోనరావుపేట మండలం నిమ్మపల్లిలో జగ్జీవన్ రామ్ జయంతి శుక్రవారం నిర్వహించారు. గిరిజన ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు బానోత్ నరేష్, మోహన్ నాయక్, ప్రకాష్, మధు, రాజు, గణేష్ పాల్గొన్నారు.



సిరిసిల్ల సర్దాపూర్‌పోలీస్ బెటాలియన్‌లో జగ్జీవన్‌రామ్ జయంతి



పూలమాల వేస్తున్న గుడిసె సదానందం



నివాళులర్పిస్తున్న కేకే మహేందర్‌రెడ్డి నాయకులు

యువత, రైతుల మధ్య వాగ్వాదం

వీర్నపల్లి, ఏప్రిల్ 5: వీర్నపల్లి మండలం మద్దిమల్ల తండాలో రైతులు ఏళ్ల నుంచి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్న స్థలంలో గత ప్రభుత్వం హయాంలో యువత ఆట స్థలం కోసం క్రీడా ప్రాంగణం బోర్డు ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో శుక్రవారం యువతకు, రైతులకు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. యువత ఆటల కోసం క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేయడంతో క్రికెట్ టోర్నమెంట్ ఏర్పాటు చేసుకున్నామని, యువత అదే స్థలంలో వరి ధాన్యం పోసేందుకు వచ్చిన రైతులను అడ్డుకున్నారు. ఈ స్థలం ముందు నుంచి ధాన్యం కొనుగోలు కేంద్రమని రైతులు చెప్పడంతో మరి క్రీడా ప్రాంగణం బోర్డు ఎందుకు ఏర్పాటు చేశారంటూ యువత ప్రశ్నించారు. ఇరు వర్గాల మధ్య కొద్దిసేపు వాగ్వాదం చోటు చేసుకుంది. అక్కడికి కొంతమంది గ్రామ పెద్దమనుషులు చేరుకొని అందరం సమావేశమై కూర్చుని మాట్లాడుకుందామని నిర్ణయించడంతో గొడవ సద్దుమణి గింది. ఈ స్థలం రిజర్వు ఫారెస్ట్‌కు సంబంధించి నదని అటువైపు వెళ్లిన అటవీ శాఖ అధికారులు తేల్చి చెప్పారు.

యువకుడి ఆత్మహత్య

జూలపల్లి, ఏప్రిల్ 5: మండలంలోని పెద్దాపూర్ గ్రామానికి చెందిన కాంపెల్లి నవీన్ (23) అనే యువకుడు అనారోగ్యకారణంతో చేత ఈనెల 4న పురుగుల మందుతాగి ఆత్మహత్యాయత్నం చేయగా చికిత్సపొందుతూ శుక్రవారం మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నెల రోజులుగా నవీన్ పచ్చకామెర్ల వ్యాధితో బాధపడుతున్నాడు. పలు ఆసుపత్రు ల్లో వైద్యం చేయించుకున్నా అది నయం కాకపోవడంతో జీవితంపై విరక్తి చెందిన నవీన్ గురువారం పురుగుల మందుతాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా గమనించిన అతని కుటుంబ సభ్యులు కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు.

గుడుంబా స్థావరాలపై దాడులు

అంతర్గాం, ఏప్రిల్ 5: మండల పరిధిలోని టీటీఎస్ అంతర్గాం, విలేజీ అంతర్గాం గ్రామాల్లో గుడుంబా స్థావరాలపై ఎక్సైజ్ సీఐ మంగమ్మ ఆధ్వర్యంలో స్థానిక టాస్క్‌ఫోర్స్ పోలీసులతో కలిసి సంయుక్తంగా దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లోని గుడుంబా స్థావరాల్లో గుడుంబా తయారీకి సిద్ధంగా ఉంచిన 400 లీటర్ల పానకం కుండలను ధ్వంసం చేశారు.

నేడు నేతన్న గర్జన సభ

సిరిసిల్ల టౌన్, ఏప్రిల్ 5: సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ సంక్షోభాన్ని నివారించాలని కోరుతూ శనివారం సిరిసిల్లలో జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న నేతన్న గర్జన సభను విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు డిమాండ్ చేశారు. శుక్రవారం సిరిసిల్ల పట్టణం సీపీఐ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మూడు మాసాలుగా సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ సంక్షోభంలోకి వెళ్లిందన్నారు. పరిశ్రమపై ఆధారపడి 30 వేల కార్మిక కుటుంబాలు జీవిస్తున్నాయన్నారు. వస్త్ర పరిశ్రమ ఈ దుస్థితికి రావడానికి ప్రధాన కారణం కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వమేననానరు. సిరిసిల్లలో వస్త్ర పరిశ్రమ మనుగడ ప్రశ్నార్థకంగా మారితే ఇతర వాణిజ్య వ్యాపార రంగాలపై ప్రభావం పడుతుందని హెచ్చరించారు. సిరిసిల్ల వస్త్ర పరిశ్ర సంక్షోభం నుంచి బయటపడాలంటే ప్రభుత్వాలు స్పందించాలన్నారు. శనివారం సిరిసిల్ల పట్టణం ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో జేఏసీ ఆధ్వర్యంలో జరగనున్న నేతన్న గర్జన సభను వస్త్ర వ్యాపారులు, ఆసా ములు, అన్ని రంగాల కార్మికులు, ఇతర వాణిజ్య రంగాల వ్యాపారులు, ప్రజలు, సీపీఐ నాయకులు, కార్యకర్తలు విజయవంతం చేయాలన్నారు. లాల్ బహుట చేనేత కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పంతం రవి, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు అజ్జ వేణు, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి సోమ నాగరాజు పాల్గొన్నారు.

రెండో ఏఎన్‌ఎంలను రెగ్యులర్ చేయాలి

సిరిసిల్ల టౌన్, ఏప్రిల్ 5: రాష్ట్రంలో నేషనల్ హెల్త్ మిషన్‌లో పనిచేస్తున్న రెండో ఏఎన్‌ఎంలను ప్రభుత్వం వెంటనే రెగ్యులర్ చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ అన్నారు. శుక్రవారం సిరిసిల్ల పట్టణం కార్మిక భవనంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి రాములు అధ్యక్షతన జిల్లా స్థాయి రెండో ఏఎన్ ఎంల సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా నరసింహ మాట్లాడుతూ 16 సంవత్సరాలుగా రెండో ఏఎన్ఎంలు కాంట్రాక్ట్ ప్రాతిపదికన పనిచేస్తున్నారన్నారు. రెండో ఏఎన్ఎంలను మొదటి ఏఎన్ఎంలకు కేవలం సహాయకులుగా మాత్రమే తీసుకున్నారని, ప్రస్తుతం వారితో మొదటి ఏఎన్ఎంలతో సమానంగా పని చేయించుకుంటున్నారని ఆరోపించారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. తెలంగాణలో ప్రభుత్వాలు మారుతున్నా రెండో ఏఎన్ఎంల జీవితాల్లో మార్పు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఏఐటీయూసీ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు తోట అంజనేయులు మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా 1,57,935 మంది రెండో ఏఎన్ఎంలు పని చేస్తున్నారని, తెలంగాణలో పనిచేసే 5000 మంది ఏఎన్ ఎంలతో పోలిస్తే మిగిలిన వారి పని చాలా తక్కువగా ఉంటుందని అన్నారు. వారి పనులతోపాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పనులతో ఇబ్బంది పడుతున్నారన్నారు. ప్రతీరోజు 10 నుంచి 12 గంటలపాటు ప్రభుత్వాలు వెట్టి చాకిరి చేయించుకుంటున్నాయని ఆరోపించారు. వీటితోపాటు ఆన్‌లైన్ పనులు కూడా చేయిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణలో ప్రభుత్వం విడుదల చేసిన జీవో నంబరు 16లో రెండో ఏఎన్ఎంలను చేర్చి రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. సమ్మె కాలంలో గత ప్రభుత్వం ఇచ్చిన 100 శాతం గ్రాస్ శాలరీని వెంటనే అమలు చేయాలన్నారు. త్రిసభ్య కమిటీని సమావేశ పర్చాలని, రెండో ఏఎన్ఎంల పని భారం తగ్గించాడానికి కృషి చేయాలని అన్నారు. సదస్సులో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు అజ్జ వేణు, రెండో ఏఎన్ఎం సంఘం రాష్ట్ర నాయకురాలు రాజేశ్వరి, నాయకురాలు వజ్రమ్మ, వసంత, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందు



ఇఫ్తార్‌విందులో నాయకులు

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 5: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. నాయకులు నరసయ్య, బాల్ రెడ్డి, అయూబ్ తదితరులు పాల్గొన్నారు

గంభీరావుపేట: గంభీరావుపేట మండల కేంద్రంలోని మసీద్‌లో ముస్లింలకు మాజీ జడ్పీటీసీ మల్లుగారి నర్సాగౌడ్ ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. మాజీ సర్పంచ్ శివయ్య, నాయకులు బాలకిషన్‌రావు, దేవేందర్ ఉన్నారు.

కంచర్లలో హరికృష్ణ అంత్యక్రియలు

- చెరువులో పడి మృతి చెందిన విద్యార్థి

వీర్నపల్లి, ఏప్రిల్ 5 : ఎల్లారెడ్డిపేట మండలం అల్మాస్‌పూర్ రంగ చెరువులో గురువారం మునిగి మృతి చెందిన పదోతరగతి విద్యార్థి గొల్లెం హరికృష్ణ అంత్యక్రియలు శుక్రవారం వీర్నపల్లి మండలం కంచర్ల గ్రామంలో నిర్వహించారు. తండ్రి వెంకటి రెండు నెలల క్రితం విదేశాలకు వెళ్లడంతో మనుమడి అంత్యక్రియలను నానమ్మ లస్మవ్వ అన్ని తానై నిర్వహించడంతో విషాదఛాయలు అలుముకున్నాయి. కడచూపు చూసేందుకు తండ్రి వెంకటి, అన్న రాజు లేరంటూ కొడుకు మృతదేహంపై పడి తల్లి లక్ష్మి బోరున విలపించడం స్థానికులను కలచివేసింది.

పుస్తెమట్టెలు అందజేత

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 5: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని నిరుపేద యువతి దేవిక వివాహానికి స్థానిక మాజీ సర్పంచ్, సామాజిక కార్యకర్త నేవూరి వెంకట్‌రెడ్డి సమకూర్చిన పుస్తెమట్టెలను మాజీ ఉప సర్పంచ్ లక్ష్మీనారాయణ శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో మండల రెడ్డి సంఘం మాజీ అధ్యక్షుడు మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జన జాతర సభను విజయవంతం చేయాలి

వేములవాడ, ఫిబ్రవరి 5: హైదరాబాద్ శివారులోని తుక్కుగూడలో శనివారం జరగబోయే తెలంగాణ జన జాతర సభను విజయవంతం చేయాలని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. గత అసెంబ్లీ ఎన్నికల ముందు సెప్టెంబర్ 17న తుక్కుగూడలో నిర్వహించిన కాంగ్రెస్ విజయభేరి సభలో ఆరు గ్యారెంటీలను ప్రకటించి, అసెంబ్లీ ఎన్నికల్లో ఘన విజయం సాధించి అధికారాన్ని హస్తగతం చేసుకున్నట్లు గుర్తు చేశారు. పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో శనివారం తుక్కుగూడలో నిర్వహించే జన జాతర సభ దేశానికే దిశా నిర్దేశం చేసే చారిత్రాత్మక సభగా నిలవనుందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను చిత్తశుద్ధి, సంకల్పబలంతో అమలు చేస్తున్నామని, తెలంగాణ మోడల్‌గా తుక్కుగూడలో ఏఐసీసీ నాయకత్వం పార్లమెంటు ఎన్నికలలో పార్టీ విధివిధానాలపై స్పష్టమైన సందేశం ఇవ్వబోతోందని అన్నారు. జిల్లా పరిధిలోని వేములవాడ, సిరిసిల్ల నియోజకవర్గాల నుంచి సుమారు ఆరు వేల మందితో జన జాతర సభకు తరలి వెళ్తున్నామన్నారు. దేశంలో ప్రజాస్వామ్య పరిరక్షణకు ఏకైక దిక్సూచి కాంగ్రెస్ మాత్రమేనని అన్నారు. రాష్ట్రంలో, దేశంలో బడుగు, బలహీన వర్గాలకు, పేద ప్రజలకు అండగా ఉండేది కేవలం కాంగ్రెస్ మాత్రమే అన్నారు. దేశానికి కీలకమైన లోక్‌సభ ఎన్నికలకు తెలంగాణ గడ్డమీద నుంచి కాంగ్రెస్ జంగ్ సైరన్ మోగించనుందన్నారు. పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ దేశ ప్రజలకు ఇచ్చే భరోసాను ఈ వేదిక నుంచే విడుదల చేస్తారని, పార్లమెంటు ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త ఒక సైనికుడిలా పని చేయాలని కోరారు.

కోనరావుపేట : కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జన జాతర సభను విజయవంతం చేయాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు ఫిరోజ్ పాషా కోరారు. కోనరావుపేట మండల కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. శనివారం తుక్కుగూడలో నిర్వహించనున్న జన జాతర సభకు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు, మహిళలు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జిల్లా నాయకులు చేపూరి గంగాధర్, చందనగిరి గోపాల్, గొట్టె రుక్మిణి, పల్లె మంజుల రవీందర్ రెడ్డి, యువజన మండల అధ్యక్షుడు బుర్ర రవీందర్, ఎల్లయ్య యాదవ్, రవీందర్, నారాయణ, ప్రకాష్ పాల్గొన్నారు.

రుద్రంగి: తుక్కుగూడలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న భారీ బహిరంగ సభను కాంగ్రెస్ కార్యకర్తలు విజయవంతం చేయాలని డీసీసీ కార్యదర్శి చెలుకల తిరుపతి అన్నారు. రుద్రంగి మండల కేంద్రంలో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తూం జలపతి, గ్రామ అధ్యక్షుడు సామ మోహన్ రెడ్డి, తర్రె మనోహర్, ఎర్రం గంగ నరసయ్య గడ్డం శ్రీనివాస్ రెడ్డి, గండి నారాయణ, మాడిశెట్టి అభిలాష్, పల్లి గంగాధర్, తర్రె లింగం, సిరికొండ రవి, ధర్నా మల్లేశం పాల్గొన్నారు

చందుర్తి : తుక్కుగూడలో శనివారం జరిగే కాంగ్రెస్ జన జాతర మహాసభను విజయవంతం చేయాలని జడ్పీటీసీ సభ్యుడు నాగం కుమార్, పార్టీ మండల అధ్యక్షుడు చింతపంటి రామస్వామి పిలుపునిచ్చారు. చందుర్తి మండల కేంద్రంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ హాజరవుతారన్నారు. సభలో కాంగ్రెస్ మేనిఫెస్టోను విడుదల చేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో నాయకులు పులి సత్యం, భీమరాజు కనకరాజు, గొట్టే ప్రభాకర్, వేల్పుల దేవాస్వామి, బొజ్జ మల్లేశం, సంటి ప్రసాద్, సంటి దాసు, దారం చంద్రం పాల్గొన్నారు.

రైతాంగంపై కాంగ్రెస్ ప్రభుత్వం చిన్నచూపు

సిరిసిల్ల రూరల్, ఏప్రిల్ 5 : రైతాంగంపై కాంగ్రెస్ ప్రభుత్వం చిన్న చూపు చూస్తోందని, వెంటనే రైతులకు రూ.2లక్షల రుణామాఫీ ప్రకటించాలని, క్వింటాల్ ధాన్యానికి రూ.500 బోనస్ ఇవ్వాలని బీజేపీ కరీంనగర్ పార్లమెంటరీ కో-కన్వీనర్ ఆడెపు రవీందర్, పట్టణ అధ్యక్షుడు నాగుల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. సిరిసిల్ల పట్టణంలోని శివనగర్ శివాలయ కల్యాణ మండపంలో శుక్రవారం బీజేపీ పట్టణ కిసాన్ మోర్చా అధ్యక్షుడు సుంకరి బాలకిషన్ ఆధ్వర్యంలో రైతు దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల కురిసిన వడగళ్ల వర్షానికి నష్టపోయిన పంటలకు ఎకరానికి రూ.20వేల చొప్పున పరిహారం అందించడం తోపాటు రైతు భరోసా కింద ఎకరానికి రూ. 15వేలు అందించాలన్నారు. క్వింటాల్ ధ్యాన్యానికి రూ.500 బోనస్‌ను అందిస్తామని ప్రకటించారని ఇంతవరకు అందించడం లేదన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి తరుగు లేకుండా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. బీజేపీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు బర్కం వెంకటలక్ష్మి, కిసాన్ మోర్చా ప్రధాన కార్యదర్శి బండారి వెంకటేశ్వర్లు, పట్టణ ఉపాధ్యక్షులు చొప్పదండి అంజన్న, ఊరగొండ రాజు, సదానందం, పంపరి అర్జున్, కోడం శ్రీనివాస్, గుడ్ల విష్ణు, సరిమల్లె మల్లేశం, పండుగ మాధవి, నుంచు ప్రకాష్, తాటిపాముల సత్యం తదితరులు పాల్గొన్నారు.

ఇల్లంతకుంట: రైతుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బీజేపీ మండల అధ్యక్షుడు కొత్త శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం నర్సక్కపేటలో రైతు దీక్ష చేపట్టారు. జిల్లా ఉపాధ్యక్షుడు సాయిని మల్లేశం, కిసాన్‌మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు రొండ్ల మధుసూదన్‌రెడ్డి, కిసాన్‌మోర్చా అధ్యక్షుడు చింతలపల్లి శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు తిప్పారపు శ్రావణ్, చిమ్మనగొట్టు శ్రీనివాస్, అనీల్‌కుమార్, భూమల్ల ప్రశాంత్, కిషన్‌గౌడ్, దూది సుధీర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సాయి, రాంరెడ్డి, మధు, తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సిరిసిల్లలో రైతు దీక్ష చేస్తున్న బీజేపీ నాయకులు

ఎల్లారెడ్డిపేట: కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని బీజేపీ కిసాన్ మోర్చా నాయకులు డిమాండ్ చేశారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో ఆ పార్టీ నాయకులు శుక్రవారం రైతు దీక్షను చేపట్టారు. బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు బాపురెడ్డి, నాయకులు సత్యంరెడ్డి, భాస్కర్, బాల్‌రెడ్డి, రమేశ్, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

వీర్నపల్లి : కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలంటూ బీజేపీ ఆదేశాల మేరకు మండల కేంద్రంలో నిరసన దీక్షను చేపట్టినట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు గునుగుల దేవేందర్ రెడ్డి తెలిపారు. రైతులకు రుణమాఫీ, పంట నష్టపరిహారం, ధాన్యం కొనుగోలు బోనస్, సబ్సిడీ విత్తనాల హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షుడు బోడ మల్లేశం, ఎస్టీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్య రమేష్, ఎస్టీ మోర్చా మండల అధ్యక్షుడు మాలోతు ప్రకాష్, వీర్నపల్లి బూత్ అధ్యక్షుడు లింబాద్రి పాల్గొన్నారు

తంగళ్లపల్లి: పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ. 25 వేల పరిహారం చెల్లించాలని బీజేపీ సిద్దిపేట నియోజకవర్గ ఇన్‌చార్జి ఎర్రం మహేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం తంగళ్లపల్లి మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో రైతు దీక్ష చేపట్టారు. తంగళ్లపల్లి మండల అధ్యక్షుడు వెన్నమనేని శ్రీధర్ రావు, కిసాన్ మోర్చా అధ్యక్షుడు జంగం కిషన్, కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి బక్క శెట్టి రాజేందర్, రాజన్న సిరిసిల్ల జిల్లా అధికార ప్రతినిధి మిర్యాల లింగయ్య, మాజీ ప్యాక్స్ చైర్మన్ ఆసాని రామలింగారెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి కలికోట చరణ్, మహిళా మోర్చా అధ్యక్షురాలు కోదం భవిత, ఎస్సీ మోర్చా అధ్యక్షుడు ప్రశాంత్, ఓబీసీ మోర్చా అధ్యక్షుడు తాడూరు రవి, బీజేవైఎం మండల అధ్యక్షుడు వినయ్, బీజేవైఎం మాజీ మండల అధ్యక్షుడు కోలా ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి రాజు ఉపాధ్యక్షుడు ఇటుకల రాజు, ఇటుకల మహేందర్, సీనియర్ నాయకులు జూకంటి అఖిల్, కన్నె అరుణ్, సిరిసిల్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

గంభీరావుపేట: గంభీరావుపేట మండల కేంద్రంలో శుక్రవారం బీజేపీ మండల శాఖ, కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో రైతు దీక్ష చేపట్టారు. గత బీఆర్ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వాలు రైతులకు ఇచ్చిన హామీలు నీటి మూటలయ్యాయని ఆరోపించారు. బీజేపీ మండల అధ్యక్షుడు గంట అశోక్, కిసాన్ మోర్చా అధ్యక్షుడు కోడె రమేష్, నాయకులు పత్తి స్వామి, దేవేందర్, నాగరాజుగౌడ్, సత్యనారాయణ, ఎలేందర్, లక్ష్మీపురం రాజు, అంజనేయులు, అన్వర్ రైతులు మల్లేశం, రాజయ్య, లింగం తదితరులు ఉన్నారు.